# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 18.11.2024 | 24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:26

www.vishalabharati.com




## కేటీఆర్ అరెస్టు కథ కంచికే

- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఢిల్లీలో సెటిల్‌మెంట్
- కేసీఆర్, రేవంత్ మధ్య వ్యాపార సంబంధాలు
- ఇద్దరూ కలిసి డ్రామాలు చేస్తున్నారు
- బీజేపీని తొక్కేయాలన్నదే వారి ప్లాన్
- ఈ విషయం నేను నిరూపిస్తా..
- లేదంటే రాజకీయాల నుంచి తప్పకుంటా
- తెలంగాణలో ఇద్దరు సీఎంలు
- కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపణలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో బీజేపీ ఎదుగుతుంటే ఓర్వలేక.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి తొక్కేస్తున్నారని.. కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం సంగారెడ్డిలో పర్యటించిన బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. తనకు, రేవంత్ మధ్య వ్యాపార సంబంధాలున్నాయని బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఈ విషయాన్ని నిరూపిస్తే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని బండి సంజయ్ స్పష్టం చేశారు. కేసీఆర్, రేవంత్ కుటుంబానికి వ్యాపార సంబంధాలు ఉన్నాయని తాను నిరూపిస్తానన్నారు. తాను నిరూపిస్తే.. కేసీఆర్ ఫ్యామిలీ

..మిగతా 2 లో

# తగ్గేదేలే..

## మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

- ఎవరు అడ్డుకున్నా ఆగదు..
- కిషన్ రెడ్డి గుజరాత్‌గులాం
- సబర్మతి ప్రక్షాళన చేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదు
- గుజరాత్ మోడల్ ఫెయిలయ్యిందా..?
- మూసీ ప్రక్షాళన బీజేపీకి ఇష్టం లేదు
- 11 ఏళ్లలో ప్రధాని మోడీ ఏం చేశారు..?
- రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీ ఏమైంది..?
- కిషన్ రెడ్డిని బీజేపీ వాడుకుంటోంది
- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

మూసీ పరివాహక బస్తీల్లో బీజేపీ నేతలు బస్తీ నిద్ర చేశారు. దీనిపై ఆదివారం నాడు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ.. కిషన్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్న కిషన్ రెడ్డి సబర్మతి ప్రక్షాళన చేసిన సమయంలో ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. కిషన్ రెడ్డి గుజరాత్ కు గులాం అయ్యారంటూ ఆరోపించారు. సబర్మతి కోసం 15వేలకు పైగా కుటుంబాలను వేరే చోటుకు తరలించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ మోడల్ దేశానికి ఆదర్శమంటున్నారు.. మూసీ ప్రాజెక్ట్‌కు మాత్రం ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్ వద్దంటున్నారంటే.. గుజరాత్ మోడల్ ఫెయిల్ అయ్యిందా..? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. మూసీని బాగుచేయడం బీజేపీకి ఇష్టం లేదని రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు.. మూసీ పరివాహక ప్రాంతంలో

..మిగతా 2 లో

## ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫ్రీ..

- 100 శాతం పన్ను మినహాయింపు
- నేటి నుంచి అమల్లోకి కొత్త పాలసీ
- కాలుష్యం నివారణకే ఈ నిర్ణయం
- ఆర్టీసీలోనూ ఎలక్ట్రిక్ బస్సులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

..మిగతా 2 లో

## మూసీ పరివాహక ప్రాంతాల్లో భయం భయం..

- గుండె పోటుతో 10 మంది మృతి
- ఇళ్లు కూల్చకుండా మూసీని అభివృద్ధి చేయాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:


పేదలపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతంలో రాత్రి బస చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అక్కడి ప్రజలు భయానక పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. సుమారు 10 మంది గుండె పోటుతో

..మిగతా 2 లో

## విద్యార్థికి గుండు కొట్టించిన ప్రొఫెసర్

- ఖమ్మం మెడికల్ కాలేజీలో దారుణం
- చైనా స్టైల్ కటింగ్‌తో తరగతులకు హాజరు
- మందలించిన సీనియర్ విద్యార్థులు

..మిగతా 2 లో



## రేవంత్.. 11 నెలల్లో ఏం సాధించావ్..?

- గురుకుల విద్యార్థులు చనిపోతున్నా పట్టదా?
- మాటలు కోటలు దాటుతున్నాయి
- పనులు మాత్రం జరగడం లేదు
- ఈ చావులు ప్రభుత్వ హత్యలే
- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్





విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యలతో మరణ మృదంగం మోగుతున్నదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. గురుకులాల్లో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, గడిచిన 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి.. కానీ చేతలు మాత్రం గడప దాటడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవం నాడు సీఎం ప్రగల్భాలు పలకడం తప్ప.. ఎలాంటి కార్యచరణకు దిక్కులేదని అన్నారు. సంగారెడ్డి జిల్లా బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిన్న మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం

## మూసీ నిద్ర ఓ డ్రామా

- కిషన్ రెడ్డిని చూసి జనం నవ్వుకుంటున్నారు
- బీఆర్ఎస్ ను ప్రొటెక్ట్ చేసేందుకు కిషన్ రెడ్డి యత్నం
- దమ్ముంటే మూడు నెలలు బసచేయాలి
- పీపీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రాజెక్టు ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫోటో షూట్ కోసం మూసీ నిద్ర చేశారని అన్నారు. బస చేసే ముందు ఆ ప్రాంతంలో దోమల మందు, ఈగల మందు కొట్టారు.. మూడు నెలలు అక్కడ ఉంటే ప్రజల అవస్థలు తెలుస్తాయని పేర్కొన్నారు. మూసీ పక్కన మూడు నెలల బస చేయండని మా సీఎం సవాల్.. నేను కూడా వస్తాను. మీరు నేను ఇద్దరం కలసి మూడు నెలలు అక్కడ బస చేద్దాం రండి అని సవాల్ చేశారు. అక్కడి ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ పడిన ప్రతీసారి కిషన్ రెడ్డి బయటకి వస్తారు.. బీఆర్ఎస్ ను ప్రొటెక్ట్ చేయడానికి కిషన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.ఒక్కరోజు నిద్ర చేసి ఏం సాధించారని

..మిగతా 2 లో

## నేడు ఢిల్లీకి కేటీఆర్

- హాట్ టాపిక్‌గా మారిన టూర్
- బాధితులతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు
- కేంద్ర మంత్రులను కలుస్తారా..?



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రేపు ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. లగచర్లలో ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తున్న బాధిదులు, రైతులతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేయబోతున్నట్లు సమాచారం. కాగా, ఇప్పటికే రైతులు, ఫార్మా కంపెనీ బాధితులు ఢిల్లీ చేరుకున్నారు. రేపు సాయంత్రం కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి.. రైతులతో కలిసి స్వయంగా కమిషన్‌కు వెళ్లి కంప్లైంట్ చేయనున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలే లగచర్లలో ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తున్న రైతులు.. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన వికారాబాద్ కలెక్టర్‌పై, అధికారులపైన దాడికి పాల్పడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్‌లో ఈ ఘటన జరుగడంతో ప్రభుత్వం సీరియస్‌గా

..మిగతా 2 లో



03

## డేంజర్ జోన్‌లో ఢిల్లీ

- నేటి నుంచి పాఠశాలలు బంద్
- కొన్నాళ్ల పాటు ఆన్‌లైన్ తరగతులే
- రవాణా ట్రక్కులకు నో ఎంట్రీ
- ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం
- కీలక నిర్ణయాలు తీసుకోనున్న సర్కార్

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
18.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మూసీ నిద్ర ఓ డ్రామా

మొదటి పేజీ తరువాయి

పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి అందుకు అడ్డుపడుతున్నారు.. సబర్మతి రివర్ ఫ్రంట్ కి ఒక న్యాయం.. మూసీ రివర్‌కి ఒక న్యాయమా..? అని ప్రశ్నించారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చి ఆదుకుంటాం.. వారి పిల్లలకు విద్య అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతుంది అనగానే.. వీళ్లకు భయం పట్టుకుందని అన్నారు. గుజరాత్‌ను ఎక్కడ తెలంగాణ వెనక వేస్తుందో అన్న భయం బీజేపీని వెంటాడుతుందని పేర్కొన్నారు. ప్రళయాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు..

# తగ్గేదేలే..

మొదటి పేజీ తరువాయి



ఉండి చూడాలని, అక్కడున్న పేదలు ఎలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారో అక్కడే నిద్ర చేసి చూడాలని రేవంత్ రెడ్డి సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సవాల్ ను స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ నేతలు నిన్న రాత్రంతా మూసీ పరివాహక ప్రాంతంలో నిద్ర చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి, బీజేపీ నేతలు సీఎం రేవంత్ పై విమర్శలు గుప్పించారు. ఆ విమర్శలకు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. గంగా నది, సబర్మతి నది ప్రక్షాళన చేసినప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు సీఎం రేవంత్. అప్పుడు మాట్లాడని కిషన్ రెడ్డి.. ఇప్పుడు తెలంగాణలో మూసీ ప్రక్షాళనకు వచ్చేసరికి ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ఎందుకు అడ్డుకుంటున్నారు? అని సీరియస్ అయ్యారు. మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేలా బీజేపీ షిండేను వాడుకుందని.. ఇప్పుడు తెలంగాణలో కిషన్‌రెడ్డిని వాడుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. ఎవరు అడ్డుకున్నా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ ప్రక్షాళనపై వెనక్కు తగ్గేది లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

పదకొండేళ్లలో ప్రధాని మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. రైతులకు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ హామీ ఏమైందని అన్నారు. మహారాష్ట్రను దోచుకునేందుకు ఇద్దరు గుజరాతీలు వచ్చారని విమర్శించారు. ధారావి ప్రాజెక్టు ద్వారా పెద్ద మొత్తంలో దోచుకోవాలని బీజేపీ నేతలు చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. వారికి అవకాశం ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. మహారాష్ట్రకు రావాల్సిన 17 కంపెనీలను మోడీ గుజరాత్ కు తీసుకువెళ్లారని వ్యాఖ్యానించారు. మహాయతికి గుణపాఠం చెప్పేందుకు రైతులు, పేదలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# కేటీఆర్ అరెస్టు కథ కంచికే

మొదటి పేజీ తరువాయి

రాజకీయాల నుండి తప్పుకునేందుకు సిద్ధమా? అని ప్రశ్నించారు.

**కేటీఆర్ అరెస్టు కథ కంచికే..**

'ఢిల్లీలో సెటిల్‌మెంట్.. కేటీఆర్ అరెస్ట్... కథ కంచికే. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ ఫార్ములా, ధరణి స్కాం కేసులన్నీ గాలికే. కలెక్టర్‌పై దాడి సూత్రధారి కేటీఆర్ అని తేలినా అరెస్ట్ చేయకపోవడం సిగ్గు చేటు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకపోవడం సర్కార్ చేతగానితనమే. రాష్ట్రంలో ఆర్‌కే బ్రదర్స్ పాలన నడుస్తోంది. రైతుల సమస్యను పక్కదారి పట్టించేందుకే దాడులు తెరపైకి తెచ్చారు' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

**వారికి నిత్యం నేనే గుర్తొస్తున్నా..**

'బీఆర్ఎస్ విధ్వంసకర పార్టీ. దాడులతో ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడుతోంది. గ్రూప్ 1, కానిస్టేబుల్ ఆందోళనలోనూ బీఆర్ఎస్ విధ్వంసం చేయాలనుకుంది. ఓ రెండు రోజులు నేను కాళ్ల నొప్పితో కనపడలేదు. దానికి బీఆర్ఎస్ వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ సంగతి చెబుతామని వచ్చాను. లేచినా, పడుకున్న బీఆర్ఎస్ నేతలకు నేను గుర్తుకు వస్తున్నా' అని బండి సంజయ్ సెటైర్లు వేశారు.

'ధాన్యం కొనుగోలు చేయట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు టార్గెట్ పెట్టుకుంది. ప్రభుత్వం ధాన్యం కొనకపోవడంతో దళారులకు తక్కువ ధరకు రైతులు అమ్ముకున్నారు. ఎన్నికల సమయంలో ధాన్యానికి 500 బోనస్ అని చెప్పి.. ఇప్పుడు సన్న వడ్లకే అని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది' అని బండి సంజయ్ విమర్శించారు.



**బీఆర్ఎస్‌ను నిషేధించాలి..**

'తెలంగాణలో బీఆర్ఎస్‌ను నిషేధించాలి. రాష్ట్ర ప్రజలారా వాస్తవాలు ఆలోచించండి.. ప్రతీ విషయంలో బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోంది. నేను కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నా.. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు అప్పగించే అవకాశాల్లేవ్. వేరే వారికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారు. ఎవరికి ఇచ్చినా.. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తాం. తెలంగాణలో అధికారంలోకి వస్తాం' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# విద్యార్థికి గుండు కొట్టించిన ప్రొఫెసర్

- ఖమ్మం మెడికల్ కాలేజీలో దారుణం
- చైనా స్టైల్ కటింగ్‌తో తరగతులకు హాజరు
- మందలించిన సీనియర్ విద్యార్థులు
- సెలూన్ షాపుకు వెళ్లి ట్రీమ్ చేయించుకున్న విద్యార్థి
- విషయం తెలిసి గుండు కొట్టించిన ప్రొఫెసర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థికి గుండు కొట్టించిన ఘటన సంచలనం సృష్టించింది. ములుగుకు చెందిన విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. అతను చైనా వాళ్ల మాదిరిగా వింతగా కటింగ్ చేయించుకుని తరగతులకు హాజరవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన సీనియర్ విద్యార్థులు అతన్ని మందలించారు. ఉన్నతమైన విద్యను చదువుతున్నామని, ఇలా హెయిర్ కట్ చేయించుకోవడం మంచిది కాదని చెప్పారు. దీంతో అతను సెలూన్ షాపునకు వెళ్లి హెయిర్ ట్రిమ్ చేయించుకుని వచ్చారు. అయితే హెయిల్ స్టైల్ విషయం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి తెలిసింది.

దీంతో ఆగ్రహించిన అతను విద్యార్థిని తీసుకెళ్లి ఏకంగా గుండు కొట్టించాడు. మనస్తాపం చెందిన యువకుడు విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. బాయ్స్ హాస్టల్ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆఫీసర్‌గా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసరే విద్యార్థికి గుండు కొట్టించడంపై మండిపడ్డారు. అనంతరం అతడిని కళాశాల యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. అలాగే ఘటనను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసికెళ్లి, విచారణకు ఫోర్‌మెన్ కమిటీ నియమించారు. ఈ విషయం మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి రావడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించారు.

ఘటనపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ర్యాగింగ్ గురించి తెలిసిన వెంటనే ఉన్నతాధికారులతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుండు కొట్టిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే విచారణ చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి ఘటనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ర్యాగింగ్ పేరిట భవిష్యత్తు పాడుచేసుకోవద్దని విద్యార్థులకు మంత్రి సూచించారు. ర్యాగింగ్ భూతం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పోలీస్ శాఖ సహకారం తీసుకుని అన్ని కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం పడకుండా చూడాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. తమ జూనియర్లతో సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలి తప్ప, ర్యాగింగ్ పేరిట వారిని భయాందోళనకు గురి చేయొద్దని మంత్రి పేర్కొన్నారు.

# నేడు ఢిల్లీకి కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



తీసుకుంది. ఈ క్రమంలోనే దాడికి కారణమైన పలువురిని అరెస్ట్ చేసి జైలుకు పంపింది. అయితే తమపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ ఫార్మా బాధితులు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని ఫిక్స్ అయ్యారు. అంతేకాదు.. జాతీయ మానవహక్కుల కమిషన్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వంపైన, పోలీస్‌లపైన ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫ్రీ..

మొదటి పేజీ తరువాయి



ఇస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీని ద్వారా వినియోగదారులకు ఏడాదికి రూ.లక్ష ఆదా అవుతుందని తెలిపారు. ఆదివారం నాడు ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. నేటి నుంచి కొత్త ఈవీ పాలసీ అమల్లోకి వస్తుందన్నారు. జీవో నెం.41 ద్వారా రెండేళ్ల పాటు ఈవీ పాలసీ అమల్లో ఉంటుందన్నారు. ఈవీ వాహనాలకు వందశాతం పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పాలసీ తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ పాలసీ నవంబర్ 18, 2024 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు అమల్లో ఉంటుందన్నారు. ఈ పాలసీ ప్రకారం ఈవీల్లో టూ వీలర్స్, 4 వీలర్స్, కమర్షియల్ వాహనాలకు వందశాతం పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. వీటితో పాటు ఈవీల రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నామని ప్రకటించారు. జీవో నెంబర్ 41 ద్వారా ఈవీ పాలసీ అమల్లోకి తెస్తున్నామన్నారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ లో కాలుష్యం రాకుండా ఉండేందుకు ఈవీ పాలసీ తీసుకొచ్చామన్నారు. బైక్ లు, ఆటో, ట్రాన్స్‌పోర్ట్, బస్సులకు వందశాతం పన్ను మినహాయింపు ఇస్తున్నామన్నారు. అలాగే జంట నగరాల్లో ఈవీ బస్సులు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. "తెలంగాణలో రవాణా శాఖ పరంగా మార్పులు చేర్పులు తీసుకొచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపడుతున్నామని, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో హైదరాబాద్ ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

హైదరాబాద్ లో వాయు కాలుష్యం 83, పఠాన్ చెరులో 72 కాలుష్యం ఉందన్నారు. కాలుష్యాన్ని తగ్గించాలంటే ఈవీపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. హైదరాబాద్ లో ఇప్పుడున్న మూడు వేల బస్సులు స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. త్వరలోనే సిటీలో మొత్తం ఆర్టీసీ బస్సులు నడుస్తాయన్నారు. కొంత ఇన్ఫ్రాస్ట్రక్చర్ రావాల్సి ఉందన్నారు. "ఇప్పటి వరకు పరిమితి సంఖ్యలోనే ఎలక్ట్రిక్ వాహనాలు వాడుతున్నారన్నారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ మాత్రమే కాకుండా తెలంగాణ మొత్తం ఈవీ పాలసీ ఉంటుందని.. ఈవీ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు కాలుష్యం నుంచి కాపాడుకుందామన్నారు. వాహనాలు 15 సంవత్సరాల దాటిన వాటికి స్క్రాప్ చేయాలని పాలసీ తెచ్చామని, ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్ తెస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అనుమతి తీసుకొని క్షేత్ర స్థాయిలో 4 రాష్ట్రాల్లో పర్యటించి బెస్ట్ ఈవీ పాలసీ తెస్తున్నామని.. వాహన సారథిలో కూడా 29 రాష్ట్రాల్లో తెలంగాణ చేరుతుందని మంత్రి పొన్నం తెలిపారు. వాహనదారులు పొల్యూషన్ టెస్ట్ చేసుకునేలా అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. దేశంలో లక్ష 50 వేల మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారన్నారు. తెలంగాణలో రోజుకు 20 మంది చనిపోతున్నారన్నారు. యునిసెఫ్ ద్వారా స్కూల్ లలో రోడ్డు అవెర్నెస్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు.

**రవాణా శాఖలో ప్రమోషన్లు**

"ఈవీ వాహనాలకు గతంలో 5 వేల వెహికల్స్ వరకు టాక్స్ మినహాయింపు ఇచ్చారు. ఎలక్ట్రిక్ వెహికల్ ఎక్కడైనా ఒకటి ప్రమాదం జరిగితే ప్రజల మధ్య అపోహ సృష్టించద్దు. రవాణా శాఖ ప్రమోషన్లకు వ్యతిరేకం కాదు. అందరికీ ప్రమోషన్ లు ఇస్తాం. ప్రాసెస్ నడుస్తుంది. పొల్యూషన్ చెకప్ చేసే వాహనాలు సరిగా చేయడం లేదనే ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్ తీసుకొస్తున్నాం. ఇప్పటికే రవాణా శాఖలో 58 కానిస్టేబుల్ నియామకం జరిగాయి . ఏఎంవీఐల నియామకాలు జరిగాయి" అని మంత్రి తెలిపారు.

# రేవంత్.. 11 నెలల్లో ఏం సాధించావ్..?

మొదటి పేజీ తరువాయి



కలచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడటం శోచనీయమని పేర్కొన్నారు. ఈ చావులు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

వాంకిడిలో గురుకులంలో పాఠాలు వినాల్సిన విద్యార్థిని గత 17 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని హరీశ్‌రావు అన్నారు. దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలనుకున్న బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణం ఎవరని నిలదీశారు. సంగారెడ్డి బీసీ గురుకులంలో ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి ఆత్మహత్యకు కారణం ఎవరని అడిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే, గురుకులాలలో గత 11 నెలల్లో సగటున నెలకు ముగ్గురు ప్రాణాలు కూలిపోతున్నారని.. ఈ మరణాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలోనూ ఇదే దుస్థితి కొనసాగడం దురదృష్టకరమని హరీశ్‌రావు మండిపడ్డారు. ఘనత వహించిన కాంగ్రెస్ పాలనలో ముగ్గురు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని.. ఈ మరణాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిన గురుకులాలు.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకి దిగజారిపోతుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరక కూపాలుగా మారాయని అన్నారు. విద్యా శాఖతో పాటు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, మైనార్టీ శాఖలు నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం, అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహించే శాఖల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక మిగతా శాఖల పనితీరు గురించి చెప్పాల్సిన పనిలేదని హరీశ్‌రావు అన్నారు. ఇంకెంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవాలి ముఖ్యమంత్రి గారూ అని నిలదీశారు. ఇంకెప్పుడు మీ కార్యచరణ మొదలుపెట్టి విద్యార్థులను కాపాడుతారని ప్రశ్నించారు. ఈ చావులకు ప్రభుత్వం బాధ్యత వహించి, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# మూసీ పరివాహక ప్రాంతాల్లో భయం భయం..

మొదటి పేజీ తరువాయి

మృతి చెందారని తెలిపారు. ప్రజాపాలన అంటే ఇళ్లు కూలగొట్టడమా అని ప్రశ్నించారు. మూసీలోకి మురికి నీరు రాకూడదంటే రూ.వేల కోట్లు కావాలన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీకి.. కృష్ణా, గోదావరి జలాలు ఎలా తెస్తారో చెప్పాలన్నారు. ఇళ్లు కూల్చకుండా దీన్ని అభివృద్ధి చేయాలని కిషన్‌రెడ్డి చెప్పారు.

మూసీ సుందరీకరణకు బీజేపీ వ్యతిరేకం కాదని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. కానీ ఇందు కోసమని చెప్పి పేదల ఇళ్లు కూలుస్తామంటే ఊరుకోమన్నారు. ప్రజలు ఒప్పుకొంటే మూడింతల పరిహారం ఇచ్చి తీసుకోవాలన్నారు. మూసీ సుందరీకరణ అంటే ఇళ్లు కూల్చడం కాదు.. నీటిని శుద్ధి చేయడం అని ఎద్దేవా చేశారు.

# డేంజర్ జోన్‌లో ఢిల్లీ

మొదటి పేజీ తరువాయి

దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. వాయు కాలుష్యం స్థాయిలు పెరగడంపై ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించినప్పటికీ, తాజాగా మరిన్ని కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ 4' కింద మరిన్ని నిబంధనలను నవంబర్ 18 (సోమవారం) ఉదయం 8 గంటల నుంచి అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ రాత్రి 7 గంటల సమయానికి 457కి పెరగడం గమనార్హం.



# టియుటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ గా రాములు

- ఏకగ్రీవంగా ఎన్నిక

**సూర్యాపేట, విశాల భారతి**



తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా సూర్యాపేట జిల్లాలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఊటుకూరి జానకి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలే అదిలాబాద్ జిల్లాలో జరిగిన సంఘ మహాసభలలో ఈ ఎన్నిక జరిగినట్లు జానకి రాములు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ఉపాద్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారం చూపడంలోనూ,ఉద్యమాలు చేపట్టడంలోనూ టియుటిఎఫ్ సంఘం ముందుంటుందని వెల్లడించారు. తనపై ఉన్న నమ్మకంతో తనకు ఇంతటి బాధ్యతను అప్పగించినందుకు తన భాధ్యత మరింత పెరిగిందని,అంతే రీతిలో సంఘ అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కారం చూపేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన సంఘ నాయకులకు, సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జానకి రాములుకు పలువురు సంఘ నాయకులు ఉపాద్యాయులు, బంధు మిత్రులు శుభాకాంక్షలు చెప్పారు.కాగా జానకి రాములు ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలం వరదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.



# నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

- గంప వెంకటేష్

**ఆమనగల్లు, విశాలభారతి:**

కడ్తాల సింగల్ విండో సబ్ సెంటర్ ,ఆవరణలో ఆమనగల్లు సింగల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నుండి ప్రారంభించనున్నట్లు డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్నగర్ డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి హాజరవుతున్నారని స్థానిక, మండల ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, వ్యవసాయ అధికారులు, ప్రత్యేక అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. రైతన్నలు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యం ను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వరి క్వింటాలుకు రూ.2330 మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. రెండో రకం వరి ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2300 పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు గాను ప్రోత్సాహకంగా రూ. 500 అందివ్వడం జరుగుతుందని,వరి ధాన్యం కొనుగోలుకు వచ్చే రైతన్నలకు అన్ని రకాల ఏర్పాట్లను చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యం అమ్మి లబ్ధి పొందాలని సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా సూచించారు. ఈ సమావేశంలో సింగల్ విండో వైస్ చైర్మన్ ధోనాదుల సత్యం, జోగు వీరయ్య, సిఈఓ దేవేందర్ ఉన్నారు.

# ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ, విశాల భారతి**



బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన కే.సౌందర్య గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నది. తల్లిదండ్రులను కోల్పోయి చికిత్స చేయించుకోవడానికి ఆమెకు ఎవరు ఆధారం లేని విషయం స్థానిక ప్రజాప్రతినిధులు ద్వారా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో గుండె ఆపరేషన్ కోసం రూ.2.50లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఎల్ఓసి కాపీని సంబంధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆదివారం హైదరాబాద్ లో అందజేశారు. నిరుపేదల మైన తమకు గుండె ఆపరేషన్ కోసం రూ.2.50లక్షల ఎల్ఓసి మంజూరు చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మేలు మర్చి పోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**



గోలి గ్రామంలో 108 అడుగుల అయ్యప్ప స్వామి విగ్రహం, దేవాలయ నిర్మాణాన్ని గోలి గ్రామానికి చెందిన త్రిపుర కృష్ణారావు. అయ్యప్ప భక్తుడు గోలి గ్రామంలో అయ్యప్ప దేవాలయ నిర్మాణాన్ని తలపెట్టడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి పల్నాడు జిల్లా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డిలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం జరిగింది. వారు ఇరువురు భూమి పూజ ముహూర్త సమయానికి అక్కడికి చేరుకొని పూజా కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఇట్టి మహత్తర కార్యాన్ని తలపెట్టిన త్రిపుర కృష్ణారావుకు దేవాలయ నిర్మాణం పూర్తయ్యే వరకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ అడవిదేవులపల్లి మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు. అయ్యప్ప భక్తులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.





# ఆదివారం జనసంద్రమైన మైసిగండి

- వైభవంగా మైసిగండి బ్రహ్మోత్సవాలు

**ఆమనగల్లు విశాలభారతి :**

ఆపద మొక్కుల అమ్మగా, పేదల ఇలవేల్పుగా రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధి చెందిన కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల మైసమ్మ నామస్మరణతో మైసిగండి ఆలయం మార్మోగింది. ఆలయంలోని పుట్ట వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. పలువురు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మైసమ్మ దేవతను దర్శించుకొని పూజలు చేశారు.మైసిగండి ఆలయానికి పొటెత్తిన భక్తజనం మైసిగండి మైసమ్మ దేవతను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారంతో బ్రహ్మోత్సవాలు భక్తుల రద్దీ పెరిగింది. పంటలు భాగా పండాలని, వ్యాపారాలు అభివృద్ధి సాధించాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్,ఆలయ అర్చకులు పాల్గొన్నారు



# కారు దిగి హస్తం గూటికి చేరిన కౌన్సిలర్లు

- పార్టీలోకి ఆహ్వానించిన ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ

**బాల్కొండ, విశాల భారతి**

బాల్కొండలో బీఆర్ఎస్ పార్టీకి భారీగానే షాక్ మీద షాక్ లు తగులుతున్నాయి. ఆ పార్టీ నుండి కాంగ్రెస్ లోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలువురలు మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు కారు దిగి హస్తం గూటికి చేరారు. నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటీ భీమ్‌గల్, భీమ్‌గల్ మున్సిపల్ అంటేనే బీఆర్ఎస్. అలాంటి చోట బీఆర్ఎస్ పార్టీ నామరూపాలు ఉండకూడదు అని ఆలోచించిన నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఎదో ఒక ఎత్తుగడ వేస్తూ అక్కడి నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి లాగుతున్నారు. ఇటీవలే మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్ ను, గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లెల రాజశ్రీతో పాటు పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ అలాగే పలువురు నాయకులకు కాంగ్రెస్ తీర్థం పట్టించారు.

**కాంగ్రెస్ లో చేరిక:**

భీమ్‌గల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు సిహెచ్ గంగాధర్ (6వ వార్డు), బోర్ లింగం( 2వ వార్డు),కో ఆప్షన్ మెంబర్ అహ్మదుల్లా,గ్రామ కమిటీ అధ్యక్షుడు శెవ్వ అశోక్,సొసైటీ డైరెక్టర్ దశ గౌడ్,మాజీ సర్పంచ్ బాల గంగాధర్, అక్రమ్,ఇక్రమ్,తదితరులు కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పార్టీలో చేరినా వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న సేవలు, అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వాన్ని బలపరచి బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి పార్టీలో చేరుతున్నట్టు చేరినవారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**తొర్రూరు, విశాలభారతి:**

మత్స్యకార దినోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ కోరారు. ఈనెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవంను పురస్కరించుకొని ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతిభవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ తో కలిసి సహదేవ్ మాట్లాడారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ మహాసభ జెండా ఎగరవేసి ఐక్యత చాటుకోవాలని పిలుపునిచ్చారు. అభయ హస్తంలో భాగంగా కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ముదిరాజులను బిసిడి నుంచి బీసీ ఏ కి మార్చుతామని హామీ ఇచ్చారని, దానికి కట్టుబడి ఉండాలని కోరారు. వారు డిమాండ్ చేశారు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంధం చంద్ర మూర్తి, నారాయణ, సోమయ్య, కొండ వెంకన్న, కాగితం యాకయ్య, పులుగుజ్జ మహేష్, రామచంద్రు ,పూర్ణ, గోపాల్ ప్రసాద్, బోయిని సాంబయ్య, గంట వెంకన్న, వెంకట్, ప్రవీణ్, కుంట రమేష్ , బల్ల ప్రభాకర్, పులిగుజ్జ రవి, గంట నాగన్న, దయాకర్, కొండ వెంకన్నలు పాల్గొన్నారు.



# రైతులను రెచ్చగొట్టిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయాలి


- ధర్నాలకు, నిరసనలకు అనుమతులు ఇవ్వనివారే నేడు ధర్నాలు చేస్తుంటే హాస్యాస్పదం

**ఆమనగల్లు విశాలభారతి :**

లగచర్ల ఫార్మా ప్రజాభిప్రాయ సేకరణలో భూమి లేని బీఆర్ఎస్ కార్యకర్తలు పంపించి గిరిజన రైతులను రెచ్చగొట్టిన బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయాలని డిసిసి ప్రధాన కార్యదర్శి బిక్యా నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమ నాయక్లు కోరారు. ఆదివారం కడ్తాల్లో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు ప్రజల తరఫున పోరాడాల్సింది పోయి ప్రజలతో ఆడుకోవడం దురదృష్టకరమన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఫార్మా కంపెనీ కోసం భూసేకరణలో భాగంగా లగచర్ల గ్రామ ఘటనలో భూసేకరణలో భూమిలేని బీఆర్ఎస్ పార్టీ వ్యక్తులు ప్రవేశించి గిరిజన రైతులను రెచ్చగొట్టి ఉసిగోల్పి కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని మూర్ఖులు ఇలాంటి ఇలాంటి దాడి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో భూసేకరణకు 100 శాతం రైతులు భూమి ఇవ్వడానికి ఒప్పుకున్నారని కానీ కొంత మంది రైతులకు కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు డబ్బు ఆశతో ఒత్తిడితో రెచ్చగొట్టి కావాలనే అధికారులపై హత్యాయత్నానికి ప్రయత్నం చేశారన్నారు. లగచర్ల గ్రామ గిరిజన రైతులందరూ అమాయకులని వాళ్లను కావాలనే డబ్బు ఆశతో రెచ్చగొట్టి అధికారులపై దాడులకు ఉసిగొల్పేలా చేసిన కేటీఆర్ ను, బిఆర్ఎస్ నాయకులను వెంటనే శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో అధికారం పోయిందని అక్కస్సుతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే పనిగా బీఆర్ఎస్ నాయకులు పని చేస్తున్నారన్నారు. ప్రజల తరపున పోరాడాల్సిన ప్రతిపక్షం అమాయక ప్రజల జీవితాలతో ఆడుకోవడం దురదృష్టకరమన్నారు. గత 10 సంవత్సరాలలో అధికారాన్ని అనుభవించి ధర్నాలకు, నిరసనలకు అనుమతులు ఇవ్వనివారే నేడు ధర్నాలు చేస్తుంటే హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కెసిఆర్, కేటీఆర్, హరీష్‌రావు కుట్రలు కుత్రాత్రాలతో ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి దాడి చర్యలను ఆపకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ మండల అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షులు రామకృష్ణ, బిక్షపతి, లకృతి నాయక్, మల్లయ్య, నరేందర్, మోత్యా నాయక్, బలరాం నాయక్, రమేష్ నాయక్, నరేష్ నాయక్, దేవ్లా, సేవ్యా మరియు ఇతర గిరిజన, హరిజన నాయకులు ఉన్నారు

# వైన్ షాపులో చోరీ..

**ఆమనగల్లు విశాలభారతి:**



ఆమనగల్లు పట్టణ కేంద్రంలో వైన్స్ షాపులో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న శ్రీనివాస వైన్స్ షాపులో శనివారం చోరీ జరిగింది. వివరాల్లోకెళ్తే.. శుక్రవారం కలెక్షన్ మొత్తం యజమానులు కౌంటర్లో రెండు లక్షల నగదు ఉంచారు. దాంతో షాపులో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు ఆ నగదుతో పాటు మద్యం బాటిళ్లు, ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకులు తెలిపారు. వైన్స్ షాపు యజమాని అమనగల్లు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా ఫోరెన్సిక్, క్లూస్ టీమ్, అమనగల్లు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
18.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలలో యువత ముందుండాలి

ధర్పల్లి, విశాల భారతి:

ఆధ్యాత్మికత సేవ మార్గాలలో యువత ముందుండాలని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కే.ఎన్, శ్రీనివాస్ అన్నారు. శారీరక, మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత ఇప్పుడున్న బిజీ పరిస్థితుల్లో అత్యవసరమని అన్నారు. ధర్పల్లి మండలంలోని రేకులపల్లిని భజన మండలి స్థాయి నుంచి సేవా సమితిగా అప్ గ్రేడ్ చేసే శుభ సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా జిల్లా స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సూచించిన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస మార్గాలలో నడవాలని ఆయన సూచించారు. సత్యసాయి సంస్థలో కేవలం ఆధ్యాత్మిక చింతనే కాకుండా సేవా కార్యక్రమాలతో ఇమిడి ఉంటుందని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని అన్నారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు సేవలు అందించడం గ్రామస్థాయిలో నిర్వహించే సేవలను విస్తృతం చేసేందుకు గ్రామాలలో భజన మండలాలు, సేవాసమితిలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. సేవలను విస్తృతం చేయడానికి సత్యసాయి సంస్థలు వృద్ధి చెందేల ప్రయత్నాలు చేస్తున్నామని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో ఈ సందర్భంగా మోతిబిందు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసి పలువురికి కంటిపరీక్షలు చేసినట్లు తెలిపారు. వారికి ఉచితంగా మందులు అందించినట్లు వివరించారు. గ్రామంలో సత్యసాయి రథం వీధులలో తిప్పుతూ స్వామి వారి కీర్తనలు ప్రజలకు వినిపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా, మండల స్థాయిలో వివిధ శాఖల బాధ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవానికి హాజరైన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు, విశాల భారతి



మనీ గార్డెన్ లో గుండ్లోరిగూడెం గ్రామానికి చెందిన ఈర్ల సత్తయ్య మనమరాలు పవిత్ర మధు వివాహ మహోత్సవానికి ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో భీమనపల్లి సైదులు, పందుల భాస్కర్, వేంరెడ్డి సురేందర్ రెడ్డి, పాల్వాయి జితేందర్ రెడ్డి, బూడిద లింగయ్య, పాల్వాయి చెన్నారెడ్డి, వేంరెడ్డి జితేందర్ రెడ్డి, బొల్లం మహేష్, జంగిలి నాగరాజ్ పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు వదిలేసి ఒకరిపై ఒకరు ఆరోపణలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేట, విశాల భారతి



ప్రజల సమస్యలు గాలికి వదిలేసి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలకు పరిమితమయ్యారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతూ అన్ని వ్యవస్థలను బలహీనపరుస్తూ బడా, కార్పొరేట్ శక్తులు బాగు చేసే విధానాలు అనుసరిస్తుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను పెంచి పోషిస్తు మరోపక్క ప్రతిపక్షాలపై అర్థంలేని విమర్శలు, స్థాయి లేని ఆరోపణ చేసుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. దీనివలన నిరుద్యోగులు, చేతి వృత్తుదారులు, కార్మికులు, రైతులు, మహిళలు, వ్యవసాయ కార్మికులుగా ఉన్న సకల జనులు అనేక కష్టానష్టాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఎన్నిక,ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే పన్ను అనుకుంటూ ప్రజల మధ్య ఆర్థిక సమానతలు పెంచుతూ నూటికి 90 శాతం గా ఉన్న ప్రజల సంపద కొల్లగొట్టి 10 శాతంగా ఉన్న బడా, స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని అన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు కదిలి పోరల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 300 రోజులు దాటిన మూడు వాగ్దానాలు మాత్రమే అమలు చేసిందని ఆరోపించారు. మిగతా హామీలు వెంటనే అమలు చేసి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో మంత్రి మండలి నేటికీ ఏర్పాటు నేటికీ చేయలేకపోయారని అన్నారు. రైతులకు రుణమాఫీ అందరికీ అమలు చేయలేకపోయారని అన్నారు. రైతు భరోసా, గిట్టుబాటు ధరవంటివి మర్చిపోయారని అన్నారు. అసంఘటితరంగా కార్మికుల సమస్యలు తీర్చలేకపోయారని, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. హైడ్రా పేరుతో పేదల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. పేదలకు ఇల్లు నిర్మించిన తర్వాతనే మూసి పరివాహ ప్రాంతాలలో పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో వచ్చిన, వ్యక్తమైన సమస్యలను చిత్తశుద్ధితో అమలు చేయడం తో ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఎన్నికలు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడానికి చిత్తశుద్ధితో పనిచేయకపోతే ప్రజలు పెద్ద ఎత్తున కదిలి పోరాటాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మేదరమెట్ల వెంకటేశ్వరవు, మట్టి పెల్లి సైదులు,కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## 'ఐక్యత ఫౌండేషన్' ఆధ్వర్యంలో
# ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, విశాలభారతి:

ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 27 వరకు మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో ఆయన సభ్యులతో కలిసి వైద్య శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మి గార్డెన్ లో నిర్వహించే ఈ వైద్య శిబరానికి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి పరీక్షలతో పాటు, శుక్లాలకు సంబంధించిన సర్జరీలు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, కరుణాకర్, మల్లేష్,శ్రీను, కొండల్, అభినవ్, మల్లయ్య, కొండల్, రఘు, గణేష్, శేఖర్ పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- ప్రగాఢ సానుభూతి తెలియజేసిన కె.ప్రసాద్ రెడ్డి

జహీరాబాద్,విశాలభారతి:

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి తాండలో (ఎ)లో దేవసోత్ దశరథ్ కమలి బాయి,సంతానం అయిన 4వ కుమారుడు దేవసోత్ శ్రీను, (24) సం,, రాలు ఆదివారం తెల్లవారుజామున బావులో దూకి ఆత్మ హత్య చేసుకొన్నారు. విషయం తెలుసుకున్న ప్రజా నాయకుడు కాంగ్రెస్ నేత కె.ప్రసాద్ రెడ్డి,చింతిస్తూ..మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసీ అంతక్రియల ఖర్చు నిమిత్తం రూ.10 వేల రూపాయలు కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, కు ఫోన్ ద్వారా పంపి తాండ కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులకు పంపిణి చేశారు.ఈ సందర్బంగా ప్రజా నాయకుడు కె.ప్రసాద్ రెడ్డి,మృతుని కుటుంబానికి ధైర్యం కల్పించి అన్ని విధాలుగా అండగా భరోసాగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో తాండ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా డోలోత్సవం

- ముగిసిన లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాలు
- స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

బాల్కొండ, విశాల భారతి:



లింబాద్రి గుట్టపై జరుగుతున్న కార్తీక మాసం బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారికి డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. గర్భాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు మూల విరాట్టు దర్శనానికి బారులు తీరారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలు లింబాద్రి గుట్టపై నుండి భీమ్‌గల్ మండల కేంద్రంలోని గ్రామాలయానికి అశ్వ వాహనంపై ఊరేగింపుగా బయలుదేరాయి. రాత్రంతా ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. గ్రామాలయానికి విచ్చేస్తున్న స్వామి వారి ఉత్సవమూర్తులకు మార్గమధ్యంలోని పురాణీపేట్,భీమ్‌గల్ పట్టణంలో ప్రజలు మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు. 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి.

**స్వామి వారిని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి:**
లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని జిల్లా న్యాయ మూర్తి కుంచాల సునీత, అదనపు న్యాయమూర్తి వేముల డిప్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం అర్చకులు వారిని సాదరంగా ఆహ్వానించి స్వామివారి ఆశీర్వాదాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**కృతజ్ఞతలు తెలిపిన అర్చకులు:**
ఉత్సవాల ప్రారంభం నుండి ముగింపు వరకు సహకరించిన అధికారులకు, పోలీసులకు, సేవకులకు అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు.



## అక్రమంగా పట్టాలు పొందిన
# రాములుపై చర్యలు తీసుకోవాలి

- సొంత భూమి రైతులకు రెవెన్యూ పట్టాలో పేరు నమోదు చేసి ఇవ్వాలి

మహబూబాబాద్, విశాలభారతి:

ప్రజాలిపేట శివారు టేకుల తండాలో రెవెన్యూ తప్పిదాల వల్ల సర్వే నంబర్లు మారి, భూమిపై ఎలాంటి సంబంధం లేని రాములు అనే వ్యక్తి అక్రమంగా రెవెన్యూ పట్టాలు పొందారని తక్షణమే వాటిని రద్దు చేయాలని ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుగులోత్ భీమా నాయక్, తేజావత్ వాసునాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ సభ్యులు మాలోతు సురేష్ నాయక్,లు డిమాండ్ చేశారు.. ఆదివారం గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో టేపుల తండా రైతులను, చుట్టుపక్క రైతులను విచారించారు. అనంతరం రైతు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రజాలిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 198, 199 లో గల టేకుల తండా కు చెందిన బానోత్ వీరన్న, లక్ష్మణ్ వీరభద్రం,లకు గత తాత ముత్తాతల కాలం నుంచి ఒక ఎకరం 20 గుంటల విస్తీర్ణం ముగ్గురు అన్నదమ్ముల పొత్తులో 50 ఏళ్లుగా వారసత్వంగా వచ్చిన భూమిని స్వయంగా వారి సాగు చేసి పంటలు పండించుకుని జీవిస్తున్నారని తెలిపారు. కానీ మహబూబాబాద్ మండలం రజాలిపేటలోని నందియా తండా కు చెందిన గుగులోత్ రాములు అనే వ్యక్తి అక్రమంగా తన పేర రెవెన్యూ పట్టా పొంది ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాలు రైతుబంధు, బ్యాంకు రుణాలు, ఇతర సబ్సిడీలను గత నాలుగైదు ఏళ్లుగా పొందుతున్నాడని వారు ఆరోపించారు. కార్యక్రమంలో భానోత్ రాందాస్ నాయక్, బానోత్ బుజ్జి, భానోత్ శాంతి, భానోత్ జ్యోతి, భానోత్ కైలా, తండా పెద్ద మనుషులు పాల్గొన్నారు.



# అందని ద్రాక్షాల క్రీడ ప్రాంగణాలు

- క్రీడలకు పనికిరాకుండా పోయిన క్రీడా ప్రాంగణం
- లక్షల కొద్ది రూపాయలు వృథా
- చాలాచోట్ల స్కూల్లోనే ఏర్పాటు

అనంతగిరి, విశాలభారతి:

మండలాల్లో లక్షల కొద్ది రూపాయలు ఖర్చుచేసి గత ప్రభుత్వము ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం పేరుకే పరిమితమైనది.. క్రీడా ప్రాంగణాలు దూరంగా ఏర్పాటు చేయడంతో ఆటకు కావాల్సిన వసతులు, పరికరాలు గత ప్రభుత్వం అందజేసినప్పటికీ సంబంధిత అధికారులు వాటిని ఇష్టానుసారం ఉపయోగించడంతో క్రీడాకారులకు ఉపయోగకరంగా లేకుండా పోయాయి దీని కారణంగా క్రీడాకారులు నిరాశకురైతున్నారు. కొన్ని గ్రామాలలో వచ్చిన పరికరాలను కూడా ఇవ్వని పరిస్థితులు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం నుంచి ఎటువంటి వసతులు, పరికరాలు క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎటువంటి లేకపోవడంతో క్రీడాకారులు క్రీడకు దూరమైతున్నారు. క్రీడ మానసిక, ఆరోగ్య ఉపయోగపడే క్రీడ పేరుకే నా అని క్రీడాకారులు ఆరోదిస్తున్నారు. ఆటలకు ఉపయోగపడే విధంగా లేకపోవడంతో ఆటలు ఆడుకోలేకపోతున్నామని,ఈ క్రీడా ప్రాంగణాలు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్ని పోత్సాహించాలంటే ఆ గ్రామంలో ఉన్న గ్రౌండ్లను శుభ్రపరచాల్సిన పరిస్థితి ఉంది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్కూల్ గ్రౌండ్‌లను క్రీడా ప్రాంగణాలుగా మార్చింది. గ్రామీణ ప్రాంతాల చివరన ఏర్పాటు చేసిన గ్రౌండ్‌లను సౌకర్యాలు మెరుగుపరిచి అందుబాటులోకి తేవాలి క్రీడాకారులు కోరుతున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- లండం మల్లేష్

ఆమనగల్లు, విశాల భారతి :



కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావ్యవస్థపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎబివిపి రాష్ట్ర నాయకులు లండం మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పాలకుల విధానాలు మారట్లేదు అన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాలు రూ.7500 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం వస్తే గత ప్రభుత్వ హాయంలో ఉన్న పెండింగ్ అమౌంట్ చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ పది నెలలు అవుతున్న ఇంతవరకు విద్యార్థుల స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వలేదన్నారు. సకాలంలో నిధులు అందకపోవడంతో విద్యార్థులు పై తరగతులకు వెళ్లలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు డిగ్రీ, పీజీ, వృత్తి విద్య కోర్సులకు సంబంధించి కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో వారు కళాశాలలకు తాళాలు వేశారని,విద్యారంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాజకీయ ఆర్భాటాల కోసం లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేస్తున్న సర్కార్ బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులతో చెలగాటమాడటం సరైనది కాదన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి పెండిండ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేసి విద్యావస్థను పటిష్టంచేయాలన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
18.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## భీమ్‌గల్ గ్రంథాలయ శాఖను తనిఖీ చేసిన గ్రంథాలయ చైర్మన్

బాల్కొండ, విశాల భారతి

భీమ్‌గల్ మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖను ఆదివారం ఉదయం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఉదయం ఎనిమిది నుండి 11 గంటల వరకు విధుల్లో ఉండాల్సిన సిబ్బందిలో కేవలం స్వీపర్ మినహా ఎవరు లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథపాలకుడు సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదులు వచ్చినట్టు ఆయన తెలిపారు. సమయపాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న గ్రంథపాలకుడు గంగాధర్ గౌడ్ పై శాకాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఫిర్యాదులు రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని డీఈ తో ఫోన్లో మాట్లాడి ఆదేశించారు. నిధులు రెడీ ఉన్నా పనుల్లో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి లైబ్రరీని సొంత భవనంలోకి తేవాలని సూచించారు. లైబ్రరీకి వచ్చే రీడర్లు ఏమైనా పుస్తకాలు కొరత ఉంటే తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. పుస్తక పాఠకులకు కావలసిన అన్ని సౌకర్యాలు మెరుగు పరచడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కన్నె సురేందర్,కాంగ్రెస్ నాయకులు జేజే నర్సయ్య,పర్శ అనంత్ రావు,నల్లూరి శ్రీనివాస్,సాయిబాబా ,లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

భీమదేవరపల్లి, విశాల భారతి



నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు విక్రయిస్తున్న ఓ కిరాణా దుకాణంపై నమ్మదగిన సమాచారం మేరకు వంగర ఎస్సై దివ్య ఆదివారం సోదాలు నిర్వహించారు. మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన సుంకు సంపత్ కిరాణా దుకాణంలో సోదాలు నిర్వహించగా నిల్వ ఉంచిన 7000 విలువచేసే నిషేధిత ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కాగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ దివ్య తెలిపారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి తుమ్మల

- కొనుగోలు కేంద్రాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా
- వరి కొయ్యలను తగలబెడితే వచ్చే అనర్థాలపై రైతులకు వివరణ
- నిన్న ఒక్కరోజే 1,48,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడి
- ఇప్పటిదాకా 1,64,191 టన్నుల పత్తిని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు వెల్లడి
- సోయాబిన్ సేకరణలో దేశంలోనే మొదటిస్థానంలో తెలంగాణ

సూర్యాపేట, విశాల భారతి



వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం సూర్యాపేట జిల్లా టేకుమట్లలో ఐ.కే.పి నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అక్కడ రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వానాకాలం దిగుబడుల గురించి ఆరా తీయగా, దానికి రైతులు సరాసరి ఎకరానికి 40 బస్తాల కంటే ఎక్కువగానే దిగుబడి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్లో కూడా తమకు మంచి ఆకర్షణీయమైన ధర వస్తుందని, మిల్లర్లు కూడా తేమశాతం పట్టించుకోకుండా కల్లాల మీదనే కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్ కంటే కూడా అధిక ధర రావడంతో కొంతమంది రైతులు వాళ్ళకు అమ్ముతున్నట్లు తెలియజేశారు.
దానికి మంత్రివర్యులు స్పందిస్తూ, ప్రభుత్వం సేకరించే ధాన్యం గోదాముల్లో నిల్వ ఉంచి, అవసరాలకు తగ్గట్లుగా బియ్యం పట్టిస్తారని, అప్పటిదాకా రంగు మారకుండా ఉండటానికి 17 శాతం తేమ నిబంధన పాటించాల్సి ఉందని, మన ప్రజలకే నాణ్యమైన బియ్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా అందించడానికి ఆ నిబంధన పాటిస్తున్నట్లు పేర్కొన్నారు.
అంతిమంగా ఈ ప్రజా ప్రభుత్వ ధ్యేయం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడమే అని, అది ప్రభుత్వ కొనుగోలు ద్వారానో, ప్రైవేట్ కొనుగోలు వలన అన్నది తమకు ఆ ప్రాధాన్యమని తెలియజేశారు. మన రాష్ట్ర సన్నాలను ఇప్పుడు పొరుగు రాష్ట్రాలవారు వచ్చి మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయడం మన ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కారణమని తెలియజేశారు. ఇదే సందర్భంలో వరికొయ్యలు తగుల బెడుతుండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వ్యవసాయ శాఖ డైరెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి వ్యవసాయశాఖ తరఫున వచ్చే 15 రోజులు వరి కొయ్యలు తగులబెడ్తే వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే గ్రామ సభలలో తీర్మానాలు చేయించి దీనిని సంపూర్ణంగా అరికట్టాలన్నారు. జిల్లాలకు నియమించడిన ప్రత్యేకాధికారులు, జిల్లా కలెక్టర్లు నిత్యం ధాన్యం, ప్రత్తి కొనుగోళ్ళను పర్యవేక్షించాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు.
సోయా సేకరణలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని (29,134 క్వింటాళ్ళు, 142.53 కోట్లు) అలాగే నిన్నటి వరకు 1,82,149 మంది రైతుల వద్దనుండి 2851 కోట్ల విలువ గల 12.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, రూ. 500 బోనస్ చెల్లింపులు చేస్తున్నామని , మద్దతు ధర డబ్బులు సివిల్ సప్లై సంస్థ రైతులకు నేరుగా చెల్లిస్తుందని, బోనస్ చెల్లింపులు మాత్రం ఆర్థిక శాఖ ద్వారా జరుగుతాయని, అందుకని 4, 5 రోజులు ఆలస్యం జరుగుతుందని తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారుల నివేదిక ప్రకారం నవంబర్ 3వ వారం నాటికి 48 శాతం మేర (సుమారు 33 లక్షల ఎకరాలు ) వరి కోతలు పూర్తి అవుతాయని, నవంబర్ చివరి నాటికి ఇంకొక 21 శాతం (14 లక్షల ఎకరాలు ) కోతలు పూర్తికాగలదని అంచనా ఉన్నట్టు చెప్పారు. దానికి తగ్గట్లు వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేయడమైందని, మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు పూర్తి సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. అలాగే రూ. 1206 కోట్ల విలువ గల 1,64,191 టన్నుల పత్తిని 6815 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసామని, యావత్తు యంత్రాంగం రైతులకు అండగా ఉండి, కొనుగోళ్ళు సజావుగా నిర్వహించడానికి కృషి చేస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు.



## సగర సంఘం నూతన కమిటీలు ఎన్నిక

కల్వకుర్తి, విశాల భారతి

కల్వకుర్తి సగర సంఘం నూతన కమిటీలను ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బల్మూరు సుధాకర్, కోశాధికారి పడకంటి రాజు హాజరయ్యారు. టౌన్ అధ్యక్షులుగా రొట్టె రాజు సాగర్, ప్రధాన కార్యదర్శిగా కల్లె పల్లి జంగయ్య సాగర్, కోశాధికారి గా వావిలాల యాదగిరి సాగర్, అదేవిధంగా మండల అధ్యక్షులుగా వావిలాల సురేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి గా వావిలాల హరికృష్ణ సాగర్, కోశాధికారి వావిలాల శ్రీనివాసులు సాగర్, అదేవిధంగా యువజన సంఘం అధ్యక్షులుగా బూర్గుల భరత్, గౌరవ అధక్షులుగా వేముల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఉపాధ్యక్షులుగా వావిలాల శ్రీకాంత్, కోశాధికారిగా మెరుగు అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా నర్ల కంటి శ్రీధర్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా అనుకున్నారు, సగరులు అన్ని రంగాల్లో రాణించాలని, సగర సంఘం బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వావిలాల భీమయ్య, చేగూరి దుర్గయ్య, చిరంజీవి వెంకటరమణ, దామోదర్, చేగురి సత్యం, నరేష్, భాస్కర్,సుధాకర్, జంగయ్య, వెంకటేష్, తిరుపతయ్య, సగర సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



## భక్తిశ్రద్ధలతో కార్తీక దామోదర పూజ

భీమదేవరపల్లి, విశాల భారతి

మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో కార్తీక దామోదర పూజ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గోపూజ, మహాన్యాస రుద్రాభిషేకం, దాత్రి నారాయణ పూజ బ్రాహ్మ శ్రీ సోమశేఖర శర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసమని ఈ మాసంలో శివారాధన తప్పక చేయాలని ప్రముఖ శైవ పీట అధ్యక్షుడు విశ్వనాథం అన్నారు. సీనియర్ పాత్రికేయులు పివి మదన్ మోహన్ మాట్లాడుతూ.. కుటుంబ వ్యవస్థ దూరం అవుతున్న ఈ తరుణంలో అభోపా కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేసి పవిత్రమైన కార్తీకమాసంలో కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలిపే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం వల్ల కుటుంబ వ్యవస్థ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శ్రీనివాస్, రవీందర్, జయప్రసాద్, సుధాకర్ రావు, సుదర్శన్ రావు, శ్యాంసుందర్రావు, రామాలింగేశ్వర, ప్రశాంత్ ప్రవీణ్ శ్రీకాంత్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి..

భీమదేవరపల్లి, విశాల భారతి



వ్యక్తికి కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపెల్లి చెరువు కట్ట సమీపంలో ఆదివారం చేసుకుంది. మృతుడి కొడుకు తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర సమ్మయ్య(58) తన ఎక్సెల్ వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుతుండగా అదే సమయంలో హుస్నాబాద్ నుండి హనుమకొండ వైపు వెళ్తున్న కారు, సమయ్య ఎక్సెల్ ను ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే 108 సహాయంతో వరంగల్ ఎంజీఎం కి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ముల్కనూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేసినట్లు మృతుని కొడుకు పేర్కొన్నారు.



## ఎబిసిడి వర్గీకరణ అమలు ఎవ్వరూ అడ్డుకోలేరు

- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాదిరిగానే ఎస్సీ వర్గీకరణ కూడ న్యాయబద్ధమైనది
- మాదిగ బిడ్డలు ఆందోళన చెందవద్దు
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

సూర్యాపేట, విశాలభారతి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల పక్షపాతని, మాదిగలకు రేవంత్ రెడ్డి నాయకత్వంలో న్యాయం జరుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సానేలు అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సిల ఎబిసిడి వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని శ్రీలక్ష్మి గార్డెన్స్ నందు జరిగిన ఎస్సి ల ఎబిసిడి వర్గీకరణ పై సూర్యాపేట జిల్లా మాదిగల సమాలోచన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సిల ఎబిసిడిల వర్గీకరణ పోరాటం గత మూడు దశాబ్దాల నుండి జరుగుతుందని, దేశపు అత్యున్నత న్యాయస్థానం వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని అన్నారు. ఎబిసిడి వర్గీకరణ ద్వారా దళితులలోని పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల పక్షపాతని ఆయన చెప్పారు. ఉస్మానియా మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టారని, పిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ ను నియమించారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి ఎబిసిడి వర్గీకరణ పై అసెంబ్లీ లో ప్రకటన చేసిన దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన అన్నారు. మాదిగ జాతి ఘనమైన చరిత్ర కలిగిన జాతని పేర్కొన్నారు. మాదిగ జాతి మహోన్నతమైన చరిత్ర కలిగిన జాతని, చెప్పులు కుట్టింది, డపుకు కొట్టి సమాచారం చేరవేసింది మేమే అని ఆయన అన్నారు. మిలటరీలో జవాన్లకు బూట్లు తయారు చేసిన చరిత్ర మాదిగలదని ఆయన గుర్తు చేశారు. ఎబిసిడి వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు వుందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, సుప్రీంకోర్టు తీర్పు ను మాలలు గౌరవించాలని చెప్పారు. వర్గీకరణ అమలుకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్ గా కమిటీని నియమించిందని, ఈ కమిటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు సభ్యులుగా వున్నారని తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి లను కలిసి ఎస్సి వర్గీకరణ అమలు కు మద్దతు ఇవ్వాలని కోరతానని చెప్పారు. ఎస్సిలలోని ఉప కులాలకు, పేదలకు న్యాయం జరగాలంటె వర్గీకరణ అమలు జరగాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ అనసూయ రాములు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, చిప్పలపల్లి యాదగిరి, రెబల్ శ్రీను, వల్దాసు దేవేందర్, పాలడుగు పరశురాం, గుడిపాటి సైదులు, కడియం పరమేష్, వీరస్వామి, దాసరి శ్రీను, జయశంకర్పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

- జిల్లా పౌర సరఫరా అధికారి (డి సి యస్ ఓ )వెంకటేశ్వర్లు

మునుగోడు, విశాల భారతి

మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం జిల్లా పౌర సరఫరా అధికారి (డి సి యస్ ఓ ) వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రములో పరిశీలించి అదే విధంగా కొనుగోలు రికార్డు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యం తేమ 17% శాతం వచ్చేలా ధాన్యాన్ని అరబెట్టుకొని తాల్లు మట్టి పేల్లలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని తెలిపారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చెయ్యాలని వెంటనే వారి ఖాతాలలో డబ్బులు జమ చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసియస్ సిఈఓ పి. సుఖేందర్, ఇంచార్జ్ దుబ్బ పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యతో నిత్యం అవస్థలు

- ఎక్కడపడితే అక్కడే వాహనాల నిలిపివేత
- చౌరస్తాలో ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు

ఆమనగల్లు, విశాలభారతి :



ఆమనగల్లు పట్టణ కేంద్రంలో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి వాహనాల పార్కింగ్ కు అడ్డాగా మారింది. వాహనదారులు రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాల పార్కింగ్ తో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అనేక సార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అది అలంకార ప్రాయంగానే ఉంది. ఆదివారం సాయంత్రం పట్టణ కేంద్రములోని జాతీయ రహదారిపై బస్టాండ్ మూలమలుపు వద్ద నిలిచిన కారును బస్టాండ్ నుండి బయటకు వస్తున్న బస్సు ఢీకోనడం ప్రమాదాలకు కారణాలని స్థానికులు పేర్కొంటున్నారు. గంటల తరబడి వాహనాల పార్కింగ్ తో దుకాణదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఎదుట ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల కోసం ప్రధాన రహదారి మధ్యలోనే వాహనాలు నిలుపుతున్నారు. రాజీవ్ చౌక్ నుంచి మార్కెట్ యార్డ్ వరకే ఎక్కువ దుకాణాలు, హోటల్లు వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండటంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో వందల ద్విచక్ర వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. కొందరు వాహనదారులు రోడ్డు మధ్యలోనే వాహనాలను నిలిపి పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తుండడంతో, పాదాచారులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానికంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
18.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## అత్యుత్తమ స్కూల్ గా ప్రతిష్టాత్మక 'జీ' అవార్డు అందుకున్న కిడ్జీ స్కూల్

- దేశంలోని టాప్100 లో ఒకటిగా చందానగర్ కిడ్జి స్కూల్
- అవార్డు అందుకున్న స్కూల్
- కరెస్పాండ్ అండ్ కోఆర్డినేటర్
- జూహితేజ్వానీ,జితేందర్ తేజ్వానీ,



శేరిలింగంపల్లి,విశాలభారతి: చందానగర్ డివిజన్ పరిధిలోని సురక్ష హిల్స్ కిడ్జీ స్కూల్ కు అరుదైన గౌరవం దక్కింది.దేశంలోనే 2300 అధిక సెంటర్స్ తో కిడ్జి స్కూల్స్ కలిగి ఉన్న స్కూల్స్ లలోని 100 ఉత్తమ స్కూల్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్కూల్ లను ఎంపిక చేయగా చందానగర్ స్కూల్ కి అత్యుత్తమ నాణ్యమైన విద్య,బోధన,ఆట,పాటల్లో విద్యార్థులకు శిక్షణను అందిస్తున్నట్లు గుర్తించి ఉత్తమ స్కూల్ గా ఈ అవార్డును ప్రధానం చేశారు. శనివారం ముంబైలో జరిగిన కిడ్జీ స్కూల్ అవార్డుల ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చందానగర్ కిడ్జి స్కూల్స్ కరస్పాండెంట్ అండ్ కోఆర్డినేటర్,జితేందర్ తేజ్వాని, జూహి తేజ్వాని లు హాజరై 'జీ' అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న కిడ్జీ స్కూల్ లల్లో చందానగర్ స్కూల్ ఒకటిగా నిలవడం తమకెంతో గర్వకారణంగా ఉందని కరస్పాండెంట్ అండ్ కోఆర్డినేటర్ జూహీ తేజ్వాని, జితేందర్ లు సంతోషం వ్యక్తం చేశారు. తమ కృషి అంకిత భావానికి అవార్డు వరించిందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజేశ్వర్ రావు

హుస్నాబాద్, విశాల భారతి

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడు కాయిత బాల్ రెడ్డి కూతురు మనీషా రెడ్డి రోహిత్ కుమార్ రెడ్డిల వివాహానికి కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుడు బాల్ రెడ్డి కూతురు మనిషా రెడ్డి వివాహానికి కరీంనగర్ డెయిరీ తరపున కళ్యాణమస్తు పథకంలో భాగంగా దాదాపు 20వేల రూపాయలు విలువ చేస్తే పుస్తె మట్టేలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్ నారాయణరెడ్డి, హుస్నాబాద్ ఎమ్ సి సి మేనేజర్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మేనేజర్ చింతపూల నాగయ్య, అసిస్టెంట్ మేనేజర్ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, రూట్ సూపర్వైజర్లు సీతా రవి, ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అలోచన విధానమే దేశాభివృద్ధికి కొలమానం..

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.
- అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు అంబేద్కర్
- టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్..



మేడిపల్లి, విశాలభారతి

ఈ దేశాభివృద్ధికి కొలమానం అంబేద్కర్ అలోచన విధానమేనని అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితానికి త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ అశయ సాధన సమితి అంబేద్కర్ జ్ఞాన మాల 300 వారానికి చేరిన సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ అలోచన విధానమే ఈ దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అశయ సాధమ సంఘం అధ్యక్షుడు నత్తి మైసయ్య బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు బొమ్మ కళ్యాణ్,చీరాల నర్సింహా,భూక్యా సుమన్ నాయక్ గారు,దానగళ్ళ యాదగిరి,గుర్రాల వెంకటేష్ యాదవ్, బొమ్మకు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## అరుణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- వీర భద్రయ్య గౌడ్ జన్మదినం సందర్భంగా మెడికల్ క్యాంప్

పటాన్ చెరు,విశాలభారతి: సంగారెడ్డి జిల్లా 112 డివిజన్ రామచంద్రపురం పట్టణంలోని ఐదుగుడిల పోచమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ పాఠశాలలో నలగండ్ల వీరభద్రయ్య గౌడ్ జన్మదినం సందర్భంగా అరుణ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రేష్ఠ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని నల్లగండ్ల నర్సింగ్ గౌడ్ తెలిపారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ నలగండ్ల స్పందన మాట్లాడుతూ తమ తల్లి అరుణ పేరుతో ఈ సేవ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. తమ తండ్రి విర భద్రయ్య గౌడ్ జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి టౌన్ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, నరేందర్ రెడ్డి, భిక్షపతి యాదవ్, రాగం రమేష్ యాదవ్, బైకన్ సాయిలు యాదవ్, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య
- సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



పటాన్ చెరు(అమీన్ పూర్),విశాలభారతి

ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే రాజయ్య అన్నారు. సిపిఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో మెడిస్టార్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ వైద్యం అందినప్పుడే దేశం ముందుకు పోతుందని ఆయన అన్నారు, అనేకమంది ప్రజలు నేటికీ మెరుగైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో వైద్య ఖర్చులు భరించలేక ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలందరికీ వైద్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్య శిబిరానికి నిర్వహించడానికి ముందుకు వచ్చిన మెడిస్టార్ హాస్పిటల్ యాజమాన్యానికి అభివందనలు తెలియజేశారు. జనవరి 25 నుండి 28వ తేదీ వరకు జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో తెలంగాణ ప్రజల సమస్యను చర్చించడం జరుగుతుందని, కేంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని రాజయ్య తెలిపారు. మెడి స్టార్ హాస్పిటల్ డాక్టర్ మాట్లాడుతూ మా హాస్పిటల్ లో పేద ప్రజలకు 10 రూపాయలకే కన్సల్టేషన్ ఫీజు పెట్టామని అన్నారు. టెస్టులలో డిస్కౌంట్ ఉన్నాయని ఆమె తెలిపారు. సామాజిక బాధ్యతతో అనేక చోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, తమ వంతుగా సామాజిక సేవ చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పటాన్ చెరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, జయరాం, వెంకటేశ్వరరావు, ఎన్. శ్రీనివాస్, లోకేష్, రాములు, సురేష్, శ్రీనివాస్, హరినాథ్ హాస్పిటల్ డాక్టర్లు తేజస్వి, వెంకట్, సూపరింటెండెంట్ ఆశ, రాణి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గ్యార్వి షరీఫ్ వేడుకలు

విశాలభారతి,కూకట్పల్లి:

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని తారక రామ నగర్ లో గ్యార్వి షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఆదివారం మైనారిటీ సీనియర్ నాయకులు సమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గార్వి షరీఫ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్,కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా,కరీమ్, జగదీష్, ఖాజా,శివ,సంతోష్ బిరాదర్, రహ్మాన్,యాకుబ్,సంపత్,సలీమ్ పాల్గొన్నారు.



## బిసి వెలిమ సంక్షేమ సంఘం కార్తీకమాస వనభోజనాలు

పటాన్ చెరు(రామచంద్రాపురం)

బిసి వెలిమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రాపురం పరిధిలోని బీహెచ్ఈఎల్ జూనియర్ కాలేజీ ఆవరణలో కార్తీకమాసం వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసి వెలిమ సంఘం పెద్దలు ఎగిరెడ్డి పాపారావు, గురు అప్పారావు, దత్తి కృష్ణమూర్తి లతో పాటు ఐఐటి రామయ్య ఇష్ట విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్, సీఐ రామనాయుడు, కృష్ణవేణి టాలెంట్, మాస్టర్ మైండ్స్ స్కూల్ డైరెక్టర్ నాగరాజ్, ప్రముఖులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఈ వనభోజన కార్యక్రమంలో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ టీవీ సీరియల్ నటుడు దత్తి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రముఖులు మాట్లాడుతూ... వన భోజనాలతో ఐక్యత స్నేహభావం పెంపొందుతుందని చెప్పారు. ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వనభోజనాల సందర్భంగా ప్రతి ఒక్కరు కలుసుకొని, యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కలిసి మెలిసి ఉంటూ బిసి వెలిమ సంక్షేమ సంఘం అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెలిమ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొగ్గా అప్పలనాయుడు, జనరల్ సెక్రటరీ కిలపర్తి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు వంగపండు దుర్గారామ్, ట్రెజరర్ జగదీష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాచిగూడ ట్రాఫిక్ ఏసీపీ శ్రీరాం అంజయ్య మృతి



సికింద్రాబాద్, విశాలభారతి:

ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీరామ్ అంజయ్య ( 69 ) శనివారం హైదరాబాద్ లో ఒక ప్రవేట్ ఆస్పత్రిలో మరణించిన విషయం తెల్సిందే. అయిన ఓయూ సిఎస్ఓ గా 2018 నుండి 2021 వరకు సేవాలు అందజేశారు. అయిన ఓయూ పూర్వ విద్యార్థి. అంతకుముందు మొదట టీచర్ గా ఎంపిక అయి అనంతరం ఎస్ఐ గా నియామకం ఐయ్యారు.మహబూబ్ నగర్, వరంగల్ , రంగారెడ్డి ,సిరిసిల్ల ,జిల్లాలో ఎస్ఐ గా ,ఇన్స్పెక్టర్ గా పని చేశారు.తరువాత అయిన 2012 సం, లో హైదరాబాద్ కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పై వచ్చారు. ఇక్కడే పదవీ విరమణ చేశారు.కోదాడ నియోజకవర్గ పరిధిలోని చిలుకూరు మండలం, కొండాపురం గ్రామానికి చెందిన అంజయ్య కడుపేదరికంలో జన్మించిన చదువుల్లో రాణిస్తు ఈ స్థాయికి చేరుకున్నారు.అయిన పోలీసు శాఖలో ఎస్ఐ నుండి ఏసీపీ వరకు ఎదిగారు.వృత్తి లో అనేక అవార్డ్స్ ,రివార్డ్స్ , తో పాటుగా అధికారుల నుండి ప్రశంసలు పొందారు.పలు సామాజిక సేవాలు అందజేశారు. కళాకారునిగా సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించి అవార్డ్స్ అందుకున్నారు.వారి స్వగ్రామమైన, మండలం లో పలువురికి స్ఫూర్తిగా,మార్గదర్శిగా నిలిచారు. ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు తుర్కయాంజల్ శ్మశాన వాటిలో కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. ఆయనకు భార్య ముగ్గురు కుమారులు నగరంలో సాఫ్ట్వేర్స్ పని చేస్తున్నారు. ఓయూ మాజీ వీసీ ప్రొ. రామ చంద్రం , మాజీ వీసీ ప్రొ. గోపాల్ రెడ్డి , మాజీ ఓఎస్డీ ప్రొ. కృష్ణ రావు తో పాటు గా ఓయూ లో పలువురు విద్యార్థులు, ప్రొపెసర్స్ , ఉద్యోగులు నివాళులర్పించారు.



## చిలుక నగర్ ను నంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దుతాం

- బీరప్ప సీసీ రోడ్డు పనుల శంకుస్థాపన
- ఎమ్మెల్యే బిఎల్ఆర్

ఉప్పల్, విశాలభారతి:

చిలుకానగర్ డివిజన్ లోనీ ఈస్ట్ కళ్యాణపురి కాలనీ, బీరప్ప గడ్డలో 63 లక్షల వ్యయంతో సీసీ రోడ్ పనుల శంకుస్థాపన ఎమ్మెల్యే బిఎల్ఆర్ చిలుక నగర్ డివిజన్ నీ నంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దుతాం కార్పొరేటర్ బన్నాల అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్, చిలకనగర్ డివిజన్ ఎమ్మెల్యే బండారి ,కార్పొరేటర్ బన్నాల చిల్కానగర్ డివిజన్ లోని ఈస్ట్ కళ్యాణపురి కాలనీలో మరియు బీరప్ప గడ్డలో సుమారు 63 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో దశలమారిగా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని సిసి రోడ్డు నిర్మాణంలో భాగంగా స్వీవరగే లైన్ పనులను కూడా చేపడతామని తెలిపారు అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లోని అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నామని, బీరప్ప గడ్డ ప్రాంతంలో చిన్న చిన్న సిసి రోడ్లు పనులను దశలవారీగా పూర్తి చేస్తామని దాని తోపాటు స్ట్రాం వాటర్ లైన్ ల ను కూడా మరమ్మత్తు చేసుకుంటూ వీలున్నచోట్ల మంచినీటి పైప్లైన్ కూడా నూతన పైప్లైన్ తో మారుస్తామని తెలిపారు అలాగే చిల్కానగర్ డివిజన్ కి నిధులు వెచ్చించే విషయంలో ప్రత్యేక చొరవ చూపుతూ చిల్కానగర్ డివిజన్ కి పెద్ద ఎత్తున నిధులకు సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేకంగా చిల్కానగర్ డివిజన్ ప్రజల తరఫున కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా నిత్యం ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలను గుర్తిస్తూ ప్రణాళికా బద్ధంగా పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్న కార్పొరేటర్ గీతా ప్రవీణ్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు కార్యక్రమంలో ఈస్ట్ కళ్యాణ్ పూరి కాలనీ అధ్యక్షులు , టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ,ఈస్ట్ కళ్యాణపురి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చరిత్రలో ఎన్నడూ లేనంత ఘనంగా పాట్నా లో పుష్ప-2 ట్రైలర్ లాంచ్



మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై సుకుమార్ దర్శకత్వంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మిక మందన్న హీరోయిన్గా నటిస్తూ ప్రేక్షకులు ముందుకు రాబోతున్న చిత్రం పుష్ప 2. పుష్ప 1కు సీక్వెల్ గా ఈ చిత్రం రాబోతుంది. సుమారు పార్ట్ 1 వచ్చిన రెండు సంవత్సరాల తర్వాత ఈ చిత్రం రావడం విశేషం. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా నవీన్ నూలి ఎడిటర్ గా ఈ చిత్రానికి పనిచేయడం మరింత విశేషం. సునీల్, ఫాహద్ ఫాజిల్, అనసూయ భరద్వాజ్, రావు రమేష్, జగపతిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈరోజు బీహార్ రాజధాని పాట్నాలో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. దేశంలోనే అతిపెద్ద సినిమా అయిన పుష్ప 2 ట్రైలర్ లాంచ్ కూడా దేశంలోని అతిపెద్ద ఈవెంట్ కావడం మరింత విశేషం. దేశంలోనే ఎన్నడూ లేనివిధంగా సుమారు మూడు లక్షల మందికి పైగా ఓ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది పాట్నా చరిత్రలో ఎన్నడు జరగని పెద్ద ఈవెంట్ గా కొత్త రికార్డు సృష్టించింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా బీహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ హాజరు కావడం జరిగింది. సుమారు 900 మంది పోలీసులు, 300 మంది ప్రైవేట్ సెక్యూరిటీ వ్యక్తుల మధ్య ఈ ఈవెంట్ జరగటం విశేషం. ఈ సందర్భంగా మైత్రి మూవీ మేకర్స్ నవీన్ మాట్లాడుతూ... "పాట్నా ప్రజలందరికీ నమస్కారం. ఇంతటి అభిమానాన్ని మేము పాట్నా నుండి అస్సలు ఊహించలేదు. ఒకరికి వచ్చిన ప్రతి ఒక్కరికి మా ధన్యవాదాలు. ఈ చిత్రం ఇంతటి విజయవంతమైన ప్రయాణం కావడానికి ముఖ్య కారణం అయిన స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్. అంతేకాకుండా చిత్రంగా పనిచేసిన ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పని చేసారు. దానికి నాకు ఎంత సంతోషంగా ఉంది. అల్లు అర్జున్ ఎంతో కష్టపడి పనిచేసే వ్యక్తి. అటువంటి వ్యక్తితో పనిచేయడం మాకు ఇంత సంతోషంగా ఉంది. అదేవిధంగా ఈవెంట్ ఇంతటి విజయం సాధించడానికి ముఖ్య కారణం పాట్నా పోలీసులు. ఈవెంట్ కోసం ఇక్కడికి వచ్చి పనిచేస్తున్న ప్రతి ఒక్క పోలీస్ ఆఫీసర్కి పేరుపేరునా ధన్యవాదాలు" అన్నారు. మైత్రి మూవీ మేకర్ రవి మాట్లాడుతూ... "మేము ఇప్పటికీ ఎన్నో చిత్రాలను చేశాము. ఎన్నో ఈవెంట్స్ కూడా చేశాము. కానీ ఒక ట్రైలర్ను ఇలా విడుదల చేయడం అనేది మొదటిసారిగా జరుగుతుంది. పాట్నా నుండి ఇంతటి అభిమానాన్ని మేము ఊహించలేదు. వచ్చిన ప్రతి ఒక్కరికి మా ధన్యవాదాలు. డిసెంబర్ 5తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గత పది సంవత్సరాల్లో ఇంతటి పెద్ద ఈవెంట్ చూడటం ఇదే తొలిసారి" అన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ... "బీహార్ అందిస్తున్న ప్రేమను నేను తట్టుకోలేకపోతున్నాను. నేను ఇదే తొలిసారిగా బీహార్ రావడం. పుష్ప ఎవరి దగ్గర తగ్గడు, కానీ మొదటిసారి మీ ప్రేమానురాగాలు ముందు తగ్గుతున్నాడు. పుష్పం అంటే ఫ్లవర్ అనుకుంటున్నారా, ఇప్పుడు వైల్డ్ ఫైర్. నా అభిమానులు ఈ ఈవెంట్లో ఏమైనా చిన్నపాటి తప్పులు చేసి ఉంటే దయచేసి క్షమించండి. పుష్ప 1కు మీ ప్రేమను అందించిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు. గత కొద్ది సంవత్సరాలుగా దేశంలోనే ఎంతగా ఎదురు చూస్తున్నా సినిమాగా పుష్ప 2 ఉండటం, ఆ చిత్రంలో నేను ఒక భాగం కావడం నాకు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. దానికి కారణమైన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు. ఈ చిత్రం ఇంతటి విజయం కావడానికి ముఖ్య కారణం ప్రేక్షకులే. ప్రేక్షకులు అందరికీ పుష్ప చిత్ర బృందం తరపున ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ఇక్కడికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ కు, బీహార్ పోలీసులకు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు. పుష్ప 2 ట్రైలర్ కార్యక్రమం పాట్నాలో జరగడం నాకు ఎంతో గర్వకారణంగానూ, ఆనందంగా ఉంది ఈ చిత్రం డిసెంబర్ 5వ తేదీన మీ ముందుకు రాబోతుంది" అన్నారు.



# నా పది సినిమాల ఎక్స్పీరియన్స్ తో చెబుతున్నాను 'మెకానిక్ రాకీ' చాలా మంచి సినిమా

## :గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మెకానిక్ రాకీ' ఫస్ట్ గేర్, ట్రైలర్ 1.0 సాంగ్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. డెబ్యుటెంట్ రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ మూవీని ఎస్ఆర్టి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ చిత్రం నవంబర్ 22న విడుదల కానుంది. ఈv సందర్భంగా వరంగర్ లో 'మెకానిక్ రాకీ' ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. భారీగా హాజరైన అభిమానుల సమక్షంలో ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. ఈ ఈవెంట్ లో 'మెకానిక్ రాకీ' ట్రైలర్ 2.0 లాంచ్ చేశారు. ఈ వేడుకలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిధులు పాల్గొన్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ... ఇంత గ్రాండ్ వెల్కమ్ ఇచ్చిన వరంగల్ ఫ్యాన్స్ అందరికీ థాంక్యూ సో మచ్. ఈ వేడుకకు అతిధులుగా వచ్చిన కావ్య గారికి, ఎమ్మెల్యే గారికి థాంక్యూ సో మచ్. మేము చాలా కష్టపడి సినిమా చేస్తున్నాము. ఎంతో హార్డ్ వర్క్ చేసి మా సినిమాని ప్రమోట్ చేసుకుంటున్నాము. క్రిటిక్స్, రివ్యూవర్స్ సినిమా గురించి ఏం రాసిన ఏం కామెంట్ చేసినా పర్వాలేదు. కానీ పర్సనల్ లెవెల్ లో ఎటాక్ చేయకూడదని కోరుతున్నాను. క్రిటిక్స్ రివ్యూస్ మాకు మంచి సినిమా చేయడానికి ఒక మోటివేషన్. పర్సనల్ ఒపీనియన్ చెప్పినప్పుడు ఆ పర్సనల్ ఒపీనియన్ పై మాట్లాడే ఫ్రీడమ్ అఫ్ స్పీచ్ మాకు ఉంది. ఈ సినిమా తర్వాత రివ్యూస్ గురించి క్రిటిక్స్ గురించి నేను మాట్లాడను. మీరు స్వేచ్ఛగా రాసుకోవచ్చు. మిమ్మల్ని ఇంప్రెస్ చేయడం మా పని. మీరు కూడా ఒక సినిమా గురించి రాస్తున్నప్పుడు బాధ్యతగా ఉండాలని కోరుతున్నాను. మొన్ననే మెకానిక్ రాకీ సినిమా చూశాను. ఈ సినిమా హిట్ అయినా ఫ్లాప్ అయిన మళ్లీ సినిమా తీస్తాను. మాకు తెలిసిందంట ఒకటే సినిమా సినిమా సినిమా. అంతే ప్రాణం పెట్టి ఈ సినిమా తీశాం. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉండడానికి కారణం అభిమానులు, ప్రేక్షకులే. నాకు ఇంత మంచి లైఫ్ ఇచ్చినందుకు థాంక్యూ సో మచ్. ప్రైడ్ ఆఫ్ ఇండియన్ సినిమా పుష్ప ట్రైలర్ ఈరోజు వచ్చింది. అదిరిపోయింది. రేపు ఉదయం 11 గంటలకి మా ట్రైలర్ రిలీజ్ చేస్తాం. రేపు మా ట్రైలర్ చూడండి. డైరెక్టర్ రవితేజ తెలుగులో చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడు. మీనాక్షి శ్రద్ధ ఇద్దరు కూడా చాలా అద్భుతంగా పెమ్ చేశారు. నిర్మత రామ్ గారు నాకు పెద్ద సపోర్ట్ సిస్టం. ఆయన లేకపోతే ఈ సినిమా ఇంపాజిబుల్. తప్పకుండా ఆయన కాలర్ ఎగరేసుకునేలా చేస్తా. చాలా మంచి సినిమా తీశాం. నవంబర్ 21న పెయిడ్ ప్రీమియర్స్ ఉంటాయి. 21 న పెయిడ్ ప్రీమియర్ కి రండి. నేను చేసిన పది సినిమాల ఎక్స్పీరియన్స్ తో చెబుతున్నాను. ఇది చాలా మంచి సినిమా. ఒక ఐదు నిమిషాలు కూడా బోర్ కొట్టదు. సినిమా చూడండి. మీరు బాగుందని చెప్తే 22 నుంచి మిగతా ఆడియన్స్ చూస్తారు. మనోజ్ అదిరిపోయే విజువల్స్ ఇచ్చారు. మా మ్యూజిక్ డైరెక్టర్ జోక్స్ బిజోయ్ అదిరిపోయే ఆర్ఆర్ ఇచ్చారు. తెలంగాణలో స్టార్ట్ అయిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆంధ్రాలో సక్సెస్ మీట్ తో ఎండ్ అవుతుందని అనుకుంటున్నాను. ఈవెంట్ కి వచ్చిన అందరికీ పేరుపేరునా థాంక్యూ సో మచ్. జైహింద్' అన్నారు. నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ.. హలో వరంగల్. మెకానిక్ రాకీ' నవంబర్ 22న విడుదల కాబోతోంది. ఇది మాస్ కా దాస్ విశ్వక్ చాలా కష్టపడి ఇష్టపడి చేసిన సినిమా ఇది. డెఫినెట్ గా మీ అందరికీ నచ్చుతుంది ఆశిస్తున్నాను. ఈ సినిమా నటించిన మీనాక్షి, శ్రద్ధా, సునీల్ అందరికీ థాంక్స్. ఇది కంప్లీట్ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. డెఫినెట్ గా అందరికీ నచ్చుతుంది. నవంబర్ 22న అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు.

# మహారాష్ట్ర షెడ్యూల్ సాంగ్ తో 'తెలుసు కదా' ప్రారంభం



స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ తన అప్ కమింగ్ మూవీ 'తెలుసు కదా' లో కంప్లీట్ న్యూ అండ్ స్టైలిష్ బెస్ట్ అవతార్లో కనిపించనున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ మూవీతో డైరెక్టర్ గా డెబ్యు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్పై టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ మహారాష్ట్ర లో 24 రోజుల లాంగ్ షెడ్యూల్ ప్రారభించారు. సిద్దు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి పై చిత్రీకరిస్తున్న సాంగ్ తో ఈ షెడ్యూల్ మొదలైయింది. ఈ షెడ్యూల్ లో సాంగ్ తో పాటు క్రూషియల్ టాకీ పార్ట్ ని షూట్ చేయనున్నారు. లీడ్ యాక్టర్స్ తో పాటు సినిమాలోని కీలక నటీనటులు పాల్గొంటున్నారు.



# 2025 అక్టోబర్ 2న 'కాంతార చాప్టర్ 1'

కన్నడ స్టార్ రిషభ్ శెట్టి లీడ్ రోల్ లో నటిస్తోన్న హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'కాంతార చాప్టర్ 1'. ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్గా ఈ సినిమా సిద్ధమవుతోంది. రిషభ్ స్వీయ దర్శకత్వంలో హోంబలే ఫిలిమ్స్ బ్యానర్ పై విజయ్ కిరగందూర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ను అనౌన్స్ చేశారు. 2025 అక్టోబర్ 2న 'కాంతార చాప్టర్ 1'వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఇండియాలో దసరా బిగ్గెస్ట్ సీజన్. దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న 'కాంతార చాప్టర్ 1' రిలీజ్ కు ఇది పర్ఫెక్ట్ టైమ్. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో రిషభ్ శెట్టి ఫెరోషియస్ అవతార్ లో కనిపించారు. ఒక చేతిలో త్రిశూలం మరో చేతిలో గొడ్డలి పట్టుకొని లెజెండ్ గా కనిపించిన పోస్టర్ అదిరిపోయింది. హోంబాలే ఫిల్మ్స్ హై-క్యాలిబర్, బిగ్గెస్ట్ ప్రాజెక్ట్స్ తో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. భారతీయ ప్రేక్షకులకు అద్భుతమైన మూవీస్ అందించాలనే విజన్ తో సినిమాని నిర్మిస్తున్న నిర్మాణ హోంబాలే ఫిల్మ్స్ లో వచ్చిన కాంతార వరల్డ్ వైడ్ బిగ్గెస్ట్ హిట్ అయ్యింది. తెలుగులో ఈ సినిమా ప్రభంజనం సృష్టించింది. రిషభ్ శెట్టి ఈ చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డ్ అందుకున్నారు. 'కాంతార చాప్టర్ 1' కోసం నటుడు-దర్శకుడు రిషబ్ శెట్టి తన పాత్ర కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. కేరళ నుండి ఉద్భవించిన పురాతన యుద్ధ కళలలో ఒకటైన కలరిపయట్టులో రిషబ్ కఠినమైన శిక్షణ పొందారు.



# పెళ్లి పీటలు ఎక్కబోతున్న కీర్తి సురేశ్.?

దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు అటు తమిళ మీడియాతో పాటు ఇటు తెలుగులో చక్కర్లు కొడుతున్నాయి. గీతాంజలి సినిమాతో మలయాళంలో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చింది ఈ భామ. ఈ చిత్రం అనంతరం ప్రభు కొడుకు విక్రమ్ ప్రభు నటించిన ఇది ఎన్న మాయం అనే సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అదే ఇయర్లో నేను శైలజా అంటూ తెలుగులో వచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత రజిని మురుగన్, భైరవ, మహానటి చిత్రాలతో బ్లాక్ బస్టర్లు అందుకుంది ఈ భామ. ప్రస్తుతం బాలీవుడ్లో వరుణ్ ధావన్తో బేబి జాన్ అనే సినిమాలో నటిస్తుంది. ఇదిలావుంటే కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్లో కీర్తి సురేశ్ పెళ్లి చేసుకోబోతుందని.. అదికూడా ప్రేమ పెళ్లి కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి అని తెలుస్తుంది. పెళ్లి కొడుకు కూడా సురేష్ ఫ్యామిలీకి చాలా దగ్గరి బంధువని.. అందుకే కీర్తి ఒకే చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ రెండోవారంలో గోవాలో కీర్తి సురేశ్ పెళ్లి జరగబోతున్నట్లు టాక్. కాగా దీనిపై కీర్తి సురేష్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది.

# 21న 'సారంగపాణి జాతకం' టీజర్



మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ కథానాయికగా నటించారు. 'జెంటిల్మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20వ తేదీన సినిమా విడుదల చేయనున్నారు. నవంబర్ 21, ఉదయం 11:12 కి టీజర్ విడుదల చేయనున్నట్లు ఈ రోజు వెల్లడించారు. శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... "ఈ నెల 21వ తేదీన ఉదయం 11:12 గంటలకు మా 'సారంగపాణి జాతకం' టీజర్ విడుదల చేయనున్నాం. ప్రేక్షకులకు మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో ఆ రోజు పరిచయం చేస్తాం. సినిమా చిత్రీకరణ సెప్టెంబర్ మొదటి వారంలో పూర్తి చేశాం. డబ్బింగ్ కార్యక్రమాలు సైతం పూర్తి అయ్యాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం రీ రికార్డింగ్ పనులు జరుగుతున్నాయి. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? లేదా చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. ఇంటిల్లిపాది చూసి నవ్వుకునే వినోదాత్మక సినిమా. మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఏడాది ఆఖరులో అందరినీ నవ్విస్తుందీ సినిమా" అని అన్నారు.

# "పిక్సెల్స్ అండ్స్ స్ట్రింగ్స్" పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియో ప్రారంభం



మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కు లేటెస్ట్ టెక్నాలజీతో ది బెస్ట్ క్వాలిటీ ఇచ్చేందుకు హైదరాబాద్ మణికొండ పంచవటి కాలనీలో పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియో ఏర్పాటైంది. యంగ్ ప్యాషనేట్ పర్సన్స్ తరుణ్, భరత్ ఈ స్టూడియోను ఏర్పాటు చేశారు. ఈ రోజు పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియో పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, నిర్మాతలు అశ్వనీదత్, దిల్ రాజు, దర్శకుడు బలగం వేణు, స్వర్గీయ కృష్ణంరాజు సతీమణి శ్రీమతి శ్యామలాదేవి, మణికొండ మున్సిపల్ ఛైర్మన్ కస్తూరి నరేందర్, టీడీపీ నాయకులు టీడీ జనార్ధన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీమతి శ్యామలాదేవి మాట్లాడుతూ - పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. చాలా మంచి టెక్నాలజీతో తరుణ్, భరత్ ఈ స్టూడియోను నిర్మించారు. ఈ యంగ్ టీమ్ సక్సెస్ కావాలి. కృష్ణంరాజు గారు కూడా కొత్తవాళ్లు పరిశ్రమకు వచ్చి ఎదిగితే సంతోషించేవారు. మేము కూడా ప్రొడక్షన్ లో ఉన్నాం కాబట్టి పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ వంటి మంచి స్టూడియోస్ మాకూ అవసరం. తరుణ్, భరత్ కు నా బెస్ట్ విశెస్ తెలియజేస్తున్నా. అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ - తరుణ్, భరత్ తమ యంగ్ టీమ్ తో పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియోను మణికొండ పంచవటి కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ స్టూడియో విశేషం ఏంటంటే అంతా యంగ్ బ్యాచ్ ఉన్నారు. అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇక్కడ చేసుకోవచ్చు. ఇలాంటి స్టూడియోలు సినిమా ఇండస్ట్రీకి చాలా ఉపయోగకరం. పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ స్టూడియో బాగా సక్సెస్ కావాలి. ఆల్ ది బెస్ట్. అన్నారు. పిక్సెల్స్ అండ్ స్ట్రింగ్స్ స్టూడియో ఫౌండర్ భరత్ మాట్లాడుతూ - మా స్టూడియోలో లేటెస్ట్ టెక్నాలజీతో మంచి క్వాలిటీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ అందించబోతున్నాం. మా స్టూడియోలో డబ్బింగ్, మిక్సింగ్, 5.1, 7.1, డీఐ, డాల్బీ మిక్సింగ్ ..వంటి సర్వీసెస్ హై క్వాలిటీ టెక్నాలజీతో అందిస్తాం. మా స్టూడియోలో యంగ్ ప్యాషనేట్ ఇంజినీర్స్, కలరిస్ట్స్ , మిక్సింగ్ ఇంజినీర్స్ వర్క్స్ చేస్తున్నారు. అన్ని మూవీస్ కు క్వాలిటీ పోస్ట్ ప్రొడక్షన్ అవసరం అయితే చిన్న చిత్రాలకు ఈ క్వాలిటీ ఎక్కువగా అందడం లేదు. అందుకే మేము మెయిన్ గా చిన్న చిత్రాలకు బెస్ట్ క్వాలిటీ పోస్ట్ ప్రొడక్షన్ ఇవ్వాలని భావిస్తున్నాం. మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.